క్లుప్తంగా

సేవలతోనే గుర్తింపు



బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ భాస్కరరావును సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పూసపాటిరేగ: విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని తహసీల్దార్ ఇమంది భాస్కరరావు అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ భాస్కరరావును ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ, ప్రతి ఉద్యోగికి బదిలీ అనేది సర్వసాధారణం అయినప్పటికీ, చిత్తశుద్ధితో విధులు నిర్వహించినప్పుడే ప్రజల మన్ననలు పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పి. లావణ్య, రెవెన్యూ ఇన్స్పెక్టర్ మాధురి, కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు, వివిధ సచివాలయాల వీఆర్ఓలు పాల్గొన్నారు.

110 మంది రోగులకు నేత్ర పరీక్షలు



సత్యసాయి సేవా మందిరంలో రోగులకు నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

భోగాపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలో జిల్లా అంధత్వ నివారణ సంఘం సహకారంతో భగవాన్ శ్రీసత్యసాయి సేవాసమితి అధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 110 మంది రోగులను పరీక్షించి 53 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు వైద్యాధికారి తిరుపతిస్వామి తెలిపారు. కార్యక్రమంలో మోపాడ పీహెచ్సీ ఆప్తాలమిస్ట్ మజ్జి గణపతిరావు, శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి సిబ్బంది అలేఖ్య, ఎం.సాయికుమార్, ప్రభాకర్, రమణ, స్థానిక సత్యసాయి సేవా సమితి సభ్యులు కె. కృష్ణారావు, అట్టాడ సూర్యనారాయణ, ఎంఎల్హెచ్పీలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బదిలీ అధికారికి సన్మానం



కమాండెంట్ రాహుల్‌దేవ్‌శర్మను సన్మానిస్తున్న పోలీస్ అధికారుల సంఘ ప్రతినిధులు

డెంకాడ: బదిలీ అయిన చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ రాహుల్‌దేవ్‌శర్మను బెటాలియన్ పోలీస్ అధికారుల సంఘం గురువారం సన్మానించింది. ఈయనతో పాటు బదిలీపై వెళ్తున్న అడిషినల్ కమాండెంట్ పద్మనాభరాజు, అసిసిస్టెంట్ కమాండెంట్లు ఆంజనేయులు, నారాయణరావు, వెంకటేశ్వరరావు, మురళీకుమార్, శ్రీనివాసులతో పాటు ఆర్ఐలు, ఆర్ఎస్సైలను సత్కరించారు. కార్యక్రమంలో పోలీస్ అధికారుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోరాడ రామునాయుడు, బెటాలియన్ సంఘ అధ్యక్షుడు మిత్తిరెడ్డి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక ప్రవచనం



ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న డాక్టర్ గోపాలరావు

విజయనగరం టౌన్: రింగురోడ్డులో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణలో మహాసామ్రాజ్య పట్టాభిషేక కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం రామాయణ పారాయణం, శ్రీరామనామ భజన.. సాయంత్రం స్వామివారి కల్యాణం నిర్వహించారు. అనంతరం డాక్టర్ ఎ.గోపాలరావు ప్రవచనాలు ఆద్యంతం ఆహూతులను భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. కార్యక్రమంలో శ్రీనివాస సేవా సంఘం అధ్యక్షుడు పిళ్లా విజయ్‌కుమార్, కార్యదర్శి చెరుకూరి శ్రీధర్ పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



కేఎల్ పురం యూపీహెచ్‌సీ వైద్యురాలికి వినతిపత్రం ఇస్తున్న ఆశవర్కర్లు

విజయనగరం ఫోర్ట్: ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఆశ వర్కర్ల యూనియన్ కార్యదర్శి మహాలక్ష్మి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని కేఎల్ పురం, లంకాపట్నం, ధర్మపురి యూపీహెచ్‌పీ వైద్యులను గురువారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు మెటర్నటీ లీవ్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, రూ. 10 లక్షల బీమా కల్పించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 8న విజయవాడ వెళ్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజేశ్వరి, అప్పయ్యమ్మ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో మరో ప్రధాన రోడ్డుకు మోక్షం

- రూ. కోటి వ్యయంతో రామారాయుడు రోడ్డు అభివృద్ధి
- ప్రారంభించి వినియోగంలోకి తీసుకువచ్చిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల





రామారాయుడు రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి (ఇన్‌సెట్లో) నూతనంగా నిర్మించిన రామారాయుడు రోడ్డు

విజయనగరం: జిల్లా కేంద్రంలో ప్రధాన మార్గాలు ప్రగతి బాటపడుతున్నాయి. ఇప్పటికే నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే పలు రోడ్లను విస్తరించడంతో పాటు మరికొన్ని పాడైన రోడ్లను అభివృద్ధి చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. తాజాగా నగరంలోని 25వ డివిజన్ పరిధిలో గల ఎంఆర్ కళాశాల జంక్షన్ నుంచి ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వరకు గల రామారాయుడు రోడ్డును సుమారు రూ.కోటి వ్యయంతో అభివృద్ధి చేయగా.... డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయయాదవ్ గురువారం ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకువచ్చారు. అభివృద్ధి చేసిన రోడ్డు ప్రారంభోత్సవానికి విచ్చేసిన కోలగట్లకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, వాణిజ్య సంస్థల ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. పూలమాలలు వేసి శాలువలతో సత్కరించారు. తమ అభ్యర్థనకు స్పందించి తక్షణమే రహదారి సౌకర్యాన్ని కల్పించినందుకు వ్యాపారస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వాణిజ్య సంఘ ప్రతినిధులు కేదారశెట్టి సీతారామమూర్తి, కాపుగంటి ప్రకాష్ మాట్లాడుతూ.. నగరానికి ప్రధాన వ్యాపారి కూడలిగా ఉన్న రామారాయుడు రోడ్డు గతంలో గతుకులతో అధ్వానంగా ఉండేదని.. ఈ విషయాన్ని కోలగట్ల దృష్టికి తీసుకెళ్లగా వెంటనే కోటి రూపాయలతో అభివృద్ధి చేయడం గొప్ప విషయమన్నారు. కోలగట్ల నేతృత్వంలో నగరం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతోందని చెప్పారు. అభివృద్ధి చేసిన ప్రధాన జంక్షన్లను ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయని తెలిపారు. త్వరలోనే మహాత్మా గాంధీ భారీ విగ్రహాన్ని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ సెంటర్‌లో ఏర్పాటు చేయనున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు యడ్ల రాజేష్, బలివాడ కిరణ్, వివిధ వ్యాపార సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షేమ రథసారథిని ఆశీర్వదించండి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

- డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: ఇచ్చిన మాటకు కట్టుబడి గడిచిన నాలుగున్నరేళ్లుగా సంక్షేమ పాలన అందిస్తున్న సంక్షేమ రథసారథి జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని విజయనగరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం నగరంలోని 3వ డివిజన్ డబుల్ కాలనీ నుంచి జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను తెలుసుకుని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఏ ప్రాంతానికి వెళ్లినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలన పట్ల ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, శాసనసభ్యుడిగా కోలాగట్ల వీరభద్రస్వామిని గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో 4వ డివిజన్ కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మెండా రమణ, వేముల శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల పూసపాటిరేగ, పేరాపురం, పూసపాటిపాలెం, కొప్పెర్ల, వెల్దూరు, బూరపేట, ఎరుకొండ, పసపాం, మర్రిపేట, కిలుగుపేట, కాలపురెడ్డిపేట, నడిపల్లి, తిప్పలవలస, కోనాడ, పాతకొప్పెర్ల గ్రామాలకు శుక్రవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం రెండు వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ జి.సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలోతెలిపారు. సబ్‌స్టేషన్ నిర్వహణ పనులు చేపట్టనున్నందున సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సేల్స్‌మన్ తొలగింపు

పూసపాటిరేగ: మండలంలోని పేరాపురం మద్యం షాపులో నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు చేసిన సేల్స్‌మన్ సన్యాసిరావును విధుల నుంచి తొలిగించినట్లు భోగాపురం ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ కె. సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం ఎక్సైజ్ సూపరింటిండెంట్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

బీజేపీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం

విజయనగరం టౌన్: బీజేపీ లోక్‌సభ ఎన్నికల కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమంచి సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 25 లోక్‌సభ స్థానాల్లోనూ పార్లమెంట్ కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బవిరెడ్డి శివప్రసాదరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల పారిశ్రామిక పర్యటన

భోగాపురం: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఒకేషనల్ విద్యార్థులు ఒకేషనల్ శిక్షణలో భాగంగా గురువారం పారిశ్రామిక సందర్శనకు పెందుర్తి వెళ్లినట్లు ప్రిన్సిపాల్ పార్వతి తెలిపారు. ఒకేషనల్ శిక్షకుడు వి. చిరంజీవి, కంప్యూటర్ టీచర్ రామకృష్ణ, పీడీ సూర్య ఆధ్వర్యంలో పెందుర్తిలోని వరుణ్ మోటార్స్ ఆటో మొబైల్ వర్క్ షాపును విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా కార్ల విడి భాగాలు, ఇంజిన్ పనితీరు, తదితర అంశాల పై వర్క్‌షాపు ప్రతినిధులు అవగాహన కల్పించారు.

కొనసాగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియ



సారికలో రిజిస్ట్రేషన్ చేస్తున్న సిబ్బంది

విజయనగరం రూరల్: అందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు అందించిన ఇంటి స్థలాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ గురువారం కూడా కొనసాగింది. రెండు రోజుల పాటు సర్వర్‌లో సమస్యలు తలెత్తడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మందకొడిగా సాగినా.. గురువారం మాత్రం రిజిస్ట్రేషన్లు పుంజుకున్నాయి. విజయనగరం ఆర్ఓ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని నారాయణపురం సచివాలయంలో- 15, కోరుకొండలో- 2, సారిక- 2, కొండకరకాం- 30, మలిచర్ల- 5 చొప్పున మొత్తం 54 రిజిస్ట్రేషన్లు జరిగాయి. రిజిస్ట్రేషన్ల ప్రక్రియను సబ్ రిజిస్ట్రార్ కె.నిరంజన్‌కుమార్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ ఎస్.బంగార్రాజు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలను పరిష్కరిస్తాం

శృంగవరపుకోట: గిరిజన గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చెప్పారు. మండలంలోని ధారపర్తి పంచాయతీలో పల్లపుదుంగాడ, పార్లు గిరిజన గ్రామాలను గురువారం ఆయన సందర్శించారు. ఆయా గ్రామాల్లో గిరిజనులతో మాట్లాడి వారి అవసరాలు, సమ స్యలను తెలుసుకున్నారు. పల్లపుదుంగాడ- పార్లు రోడ్డుకు మరమ్మతులు చేయాలని, తాగునీటి సదుపాయం కల్పించాలని, పోడు పట్టాలు జారీ చేయాలని, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరారు. రఘురాజు మాట్లాడుతూ దబ్బగుంట నుంచి పల్లపుదుంగాడ కు రోడ్డు పనులు చేస్తున్నారని, పల్లపుదుంగాడ-పార్లు రోడ్డుకు మండల పరిషత్ నిధులు కేటాయిస్తామని, పోడు పట్టాల పంపిణీపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడతామని, అన్ని సమస్యలూ పరిష్కా రం చేస్తామని చెప్పారు. గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.సర్పంచ్ సన్యాసిరావు, వైస్ సర్పంచ్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగార్థులకు చుక్కానిలా...

- పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి వరంలా ఎస్.కోట గ్రంథాలయం
- అన్ని సౌకర్యాలతో పాటు.. అందుబాటులో పోటీ పరీక్షల పుస్తకాలు



ఎస్.కోట గ్రంథాలయంలో పాఠకులు

శృంగవరపుకోట: ఉద్యోగార్థుల పాలిట కల్పతరువులా, కొలువుల వేటలో కరదీపికలా నిలుస్తూ ,జ్ఞానాన్ని పంచి, యువత భవితను మారుస్తోంది ఆ గ్రంథాలయం. పోటీ పరీక్షలకు సిద్ధమ య్యే వారికి ఓ చుక్కానిలా ఎస్.కోట గ్రంథాలయం దోహదపడుతోంది. దాతల ధాతృత్వంతో అసౌకర్యాలను అధిగమించి, ఉద్యోగార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. ఇక్కడ నిరు ద్యోగ యువతకు పోటీ పరీక్షలకు కావాల్సిన అన్ని పుస్తకాలు, వసతులు అందుబాటులోకి వచ్చాయి. 2023 జూలైలో డి.శ్రీధర్ ఇక్కడ లైబ్రేరియన్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత గ్రంథాలయం తీరు మారింది. అంతవ రకూ అధ్వానంగా ఉన్న గ్రంథాలయానికి కొత్త వెలుగు వచ్చింది. పాఠకుల సౌకర్యాల కోసం లైబ్రేరియన్ పలువురిని కలిసి విరాళాలు సేకరించి ఒక్కొక్కటిగా కావాల్సిన సౌకర్యాలు కల్పించారు. లక్ష రూపాయలతో పోటీ పరీక్షల పుస్తకాలు, రూ.32 వేలతో 40 రీడింగ్ కుర్చీలు, రూ.12 వేలతో వాటర్ ఫిల్టర్, రీడింగ్ ప్లాంక్‌లు సమకూ ర్చారు. ఉచితంగా వై-ఫై సదుపాయం కల్పించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాస్తవంగా లైబ్రరీ వేళలు ఉద యం 8 గంటల నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకే. అయినప్పటికీ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత కోసం రాత్రి 11 గంటల వరకూ గ్రంథాలయాన్ని తెరిచే ఉంచుతున్నారు. గతంలో రోజువారీ పాఠకుల సంఖ్య 40 నుంచి 50 వరకు ఉండేది, నేడు అది 120కి చేరింది. అయితే గ్రంథాలయానికి ఎస్.కోట ప్రధాన రహదారిలో 2001లో సొంత భవనం నిర్మించారు.ఈ భవనం పూర్తిగా శిథిలం కావడంతో 2023లో అద్దె భవనంలోకి లైబ్రరీని మార్చారు. ప్రస్తుతం లైబ్రరీకి నెలకు రూ.6000 అద్దె చెల్లిస్తున్నారు. గ్రంథాలయానికి శాశ్వత భవనం ఏర్పాటు చేస్తే మరింత ప్రగతి సాధిస్తుందని పాఠకులు అంటున్నారు.



రీడింగ్ రూమ్‌లో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న యువత



దాతల విరాళాలతో సమకూర్చిన పోటీపరీక్షల పుస్తకాలను పరిశీలిస్తున్న లైబ్రేరియన్

ఉన్నత ఉద్యోగాల కోసం...



ప్రస్తుతం సచివాలయ ఉద్యోగినిగా పనిచేస్తున్నాను. ఉన్నత ఉద్యోగాల కోసం ఉదయమే 8 గంటలకు లైబ్రరీకి వచ్చి కొంత సమయం చదివి డ్యూటీకి వెళుతున్నా. మళ్లీ ఈ సాయంత్రం 5 గంటల తర్వాత వచ్చి రాత్రి వరకూ ప్రిపేర్ అవుతున్నాం. పోటీ పరీక్షలకు కావాల్సిన మెటీరియల్, ప్రశాంత వాతావరణం ఇక్కడ ఉంది. నాలా ఉద్యోగులు, ఉద్యోగార్థులు చాలామంది ఇక్కడికి రోజూ వచ్చి చదువుకుంటున్నారు.

– కె.వీణ, సచివాలయ ఉద్యోగిని

నాలుగు నెలలుగా లైబ్రరీకి వస్తున్నా..



నాలుగు నెలలుగా ఈ లైబ్రరీకి వస్తున్నా. ఉదయం 8గంటలకు వచ్చి రాత్రి 11గంటల వరకూ ఉంటున్నాం. పొరుగు గ్రామాల యువత చాలామంది క్యారేజీలు తెచ్చుకుని ఇక్కడే భోజనం చేసి రోజంతా లైబ్రరీలోనే చదువుకుంటున్నారు. ఏ నోటిఫికేషన్ వచ్చినా అందుకు తగిన మెటీరియల్‌ను లైబ్రేరియన్ శ్రీధర్ మాకు వెంటనే అందుబాటులో ఉంచుతున్నారు.

– డి.ప్రసాద్, కొత్తూరు.

పుస్తకాలను సమకూర్చుతున్నాం..



ఇక్కడికి వచ్చి చదువుకుంటున్న వారంతా పేదకుటుంబాలకు చెందిన యువతే. ఉద్యోగాల సాధన కోసం కష్టపడి చదువుకోవాలని వారికి ఉన్నప్పటికీ ఆర్థిక స్తోమతలేక పోటీ పరీక్షల పుస్తకాలు కొనలేక ఇబ్బంది పడుతున్నారు. అటువంటి వారి కోసం పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలన్నింటినీ సమకూర్చుతున్నాం. దాతల సహకారంతోనే వసతులు కల్పించాం. శాశ్వత భవనం ఏర్పాటైతే మరింత మందికి ఉపయోగపడుతుంది.

– డి.శ్రీధర్, లైబ్రేరియన్, ఎస్.కోట.

సూర్యోదయానికి ముందే..

- వాడవాడలా పింఛన్ల పంపిణీ



విజయనగరం రూరల్: గుంకలాంలో అవ్వకు నగదు అందిస్తున్న గ్రామ వలంటీర్

విజయనగరం రూరల్: అవ్వా, తాతలకు, ఇతర పింఛనుదారులకు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నెలా అందిస్తున్న వైఎస్సార్ పింఛన్ కానుకను గ్రామ వలంటీర్లు గురువారం ఉదయం సూర్యోదయానికి ముందే అందజేసి వారిలో ఆనందాన్ని నింపారు. విజయనగరం మండల పరిధిలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో 6140 మంది పింఛను లబ్ధిదారులు ఉండగా 5096 మందికి మొదటి రోజు పింఛన్లు అందజేశారు. మండలంలో అత్యధికంగా బియ్యాలపేట, కొండకరకాం గ్రామ సచివాలయాల్లో 92 శాతానికి పైగా పంపిణీ జరిగింది.



భోగాపురం: కిడ్నీ బాధితుడికి పింఛన్ డబ్బులు అందజేస్తున్న సర్పంచ్ కర్రోతు వెంకటరమణ

విజయనగరం మండల వ్యాప్తంగా గురువారం మధ్యాహ్నానికి 83 శాతానికి పైగా పింఛన్లు అందజేశామని ఎంపీడీఓ గంటా వెంకటరావు తెలిపారు.

కిడ్నీ బాధితుడికి..

భోగాపురం: ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైద్య రంగానికి పెద్దపీట వేస్తున్నారని పోలిపల్లి కర్రోతు వెంకటరమణ అన్నారు. మండలంలోని పోలిపల్లి గ్రామానికి చెందిన ఇస్లంపూడి వినయ్‌కుమార్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని సర్పంచ్ కర్రోతు వెంకటరమణ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి బాధితుడికి పెన్షన్ మంజూరు చేయడంతో గురువారం ఉదయం పది వేల రూపాయల నగదు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ పతివాడ రామకృష్ణ, అయ్యప్ప, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ప్రవల్లిక ప్రియ, తహసీల్దార్

పూసపాటిరేగ: మండల తహసీల్దార్‌గా ప్రవల్లిక ప్రియ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె శ్రీకాకుళం జిల్లా టెక్కలి నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ ఇమంది భాస్కరరావు బదిలీపై విశాఖ జిల్లా వెళ్లారు.

ఎంపీడీఓగా లవరాజు..



ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నూతన ఎంపీడీఓ లవరాజు

డెంకాడ: మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా (ఎంపీడీఓ) ఎ.లవరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖ జిల్లా ఆనందపురం ఎంపీడీఓగా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం లవరాజు ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావును మర్యాదపూర్వకంగా కలిశారు.

కష్టపడే వారికే ఉజ్వల భవిష్యత్



ఎస్ఐ ఉద్యోగం సాధించిన గాయత్రీ కళాశాల పూర్వ విద్యార్థిని సత్కరిస్తున్న ఆర్డీఓ శాంతి

చీపురుపల్లి: విద్యార్థి దశలో కష్టపడి చదువుకునే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆర్డీఓ బి.శాంతి చెప్పారు. స్థానిక గాయత్రీ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఆర్డీఓ శాంతి తో పాటు, సీఐ హెచ్.ఉపేంద్ర అతిథులుగా హాజరయ్యారు. ఇదే కళాశాలలో చదువుకుని ఇటీవల ఎస్ఐ ఉద్యోగం పొందిన సీహెచ్.లలితాదిత్య, డీసీసీబీ మేనేజర్‌గా ఉద్యోగం సాధించిన జి.భారతి తో పాటు ప్రస్తుతం ఇక్కడ చదువుతూ జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు సమయం వృధా చేయకుండా చదువుకోవాలని సూచించారు.ప్రస్తుత కాలంలో పక్కదోవ పట్టించే అంశాలు చాలా ఉన్నాయని మనోనిగ్రహంతో వాటిని పక్కన పెట్టి చదువుపై దృష్టి సారించినప్పుడే లక్ష్యాన్ని చేరుకోగలరన్నారు. అంతకుముందు విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. కళాశాల కరస్పాండెంట్ దాసరి శివప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించే వారికి ఉద్యోగ అవకాశాలు



క్రికెట్ కిట్లు పంపిణీ చేస్తున్న ధీర ఫౌండేషన్ అధినేత సందీప్‌బాబు

చీపురుపల్లిరూరల్(గరివిడి): క్రీడల్లో రాణించే వారికి మంచి భవిష్యత్ ఉంటుందని ధీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు బొత్స సందీప్‌బాబు అన్నారు. గరివిడి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గరివిడి మండలంలోని పలుగ్రామాల క్రీడాకా రులకు 100 క్రికెట్ కిట్లను గురువారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం-ఆంధ్రా' టోర్నమెంట్ నిర్వహిస్తున్నారన్నారు. క్రీడలు, విద్యాభివృద్ధికి ధీర ఫౌండేషన్ తరపున తమవంతు కృషి చేస్తున్నామని చెప్పారు.పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారి కోసం తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, వైఎస్సార్‌సీఈ మండల అధ్యక్షుడు కొణిశ కృష్ణంనాయుడు, పార్టీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎలకల అప్ప లనాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ పొన్నాడ కుమార్, ముల్లు రాంబాబు, కుమార్, కార్తీక్, పలు పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.